క్లుప్తంగా

పనులను నాణ్యతగా చేపట్టాలి



తిమ్మందొడ్డిలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకటప్రకాష్

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని మండల పంచాయతీరాజ్ ఏఈ వెంకటప్రకాష్ ఆదేశించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొలతను తనిఖీ చేసి పనులను త్వరితగతిన, నాణ్యతగా చేపట్టాలని కూలీలకు సూచించారు. కాగా పాత గ్రామంలో రూ.7 లక్షల జెడ్పీ నిధులతో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తెలుగు లక్ష్మన్న ఇంటి వరకు దాదాపు 125 మీటర్ల పొడవుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఏఈ తెలిపారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిఖిల్, గ్రామస్తులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



కల్లపరిలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: మండలంలోని కల్లపరి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కల్లపరి గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గ్రామానికి సమీపంలో పెద్దవొప్పి వంకకు తూము ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసుకుంటే భవిష్యత్‌లో నీటి సమస్యలు తలెత్తవన్నారు. కల్లపరి మీదుగా సి.బెళగల్, కోడుమూరు ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు. స్థానిక సీపీఎం నాయకులు వీరన్న, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ మహిళా సమావేశం



సమావేశమైన పొదుపు సంఘాల మహిళలు

కల్లూరు: కల్లూరులోని సీఆర్‌సీ బిల్డింగ్‌లో మంగళవారం లిటిల్ రోజెస్ పట్టణ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన టీఎల్ఎఫ్ ఓబీ ఎన్నికపై చర్చ జరిగింది. 45 ఐక్య సంఘాల ఓబీలు హాజరుకాగా 40 ఐక్య సంఘాల ఓబీలు పాత ఓబీలైన టి.కుల్లాయమ్మ, కె.లక్ష్మి కొనసాగాలని నిర్ణయించారు. అయితే మెప్మా సీఎంఎం అధికారి కొత్తగా సోమశేఖరమ్మ, వీరనాయణమ్మ, కె.లక్ష్మీదేవిలను కొనసాగించాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఐక్య సంఘాల సభ్యులు ఆరోపించారు. ఈ అంశంపై మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా బైలా ప్రకారం మూడు సంవత్సరాలకు ఒక్కసారి తప్పనిసరిగా ఓబీలను మార్చలని తెలిపారు.

పంచాయతీ వేలంలో పెరిగిన ఆదాయం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మార్కెట్, బండ్లమెట్ట జంతువధశాలలకు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. డీఎల్‌పీఓ రాంబాబు, గ్రామ పంచాయితీ సర్పంచ్ మేకల పల్లవి ఆధ్వర్యంలో బహిరంగా వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో పాల్గొనేందుకు నలుగురు పాటదారులు హాజరైయ్యారు. రూ. 4లక్షల 67వేలకు గ్రామానికి చెందిన ముస్తాఫా అనే వ్యక్తి పాట దక్కించుకున్నట్లు డీఎల్‌పీఓ రాంబాబు తెలిపారు. గత ఏడాది తొమ్మిది నెలలకు గాను రూ. 3 లక్షల 30 వేలకు వేలం పాట ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో భూ రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే రీ సర్వేకు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు కరుణాకర్‌రెడ్డి, చంద మామబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూధార్ టెన్షన్

- సొంత పట్టాలు కలిగిన వారికే నమోదుకు అవకాశం
- డీకేటీ పట్టాలపై రాని స్పష్టత
- భూధార్ లేకుంటే పథకాలు అందవంటున్న అధికారులు
- వేధిస్తున్న నెట్‌వర్క్, సర్వర్ సమస్యలు
- ఆందోళనలో అన్నదాతలు



భూధార్ నమోదు చేస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

కర్నూలు(రూరల్): ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత భూపట్టాలు కలిగిన ప్రతి రైతుకు 14 అంకెల గుర్తింపు సంఖ్యను జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రకియను చేపడుతున్నారు. భవిష్యత్‌లో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్య ప్రమాణికం కానుందని, భూధార్‌ను విధిగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. లేకపోతే ఎలాంటి పథకాలు అందవని హెచ్చరిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనతో రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దేశానికి రైతు వెన్నుముక అని మాటలు చెబుతునే వారి నడ్డి విరిచే కార్యక్రమానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూధార్‌కు సంబంధించి తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకే ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. ఆ తర్వాత సొంత భూములు కలిగి పట్టాలు ఉన్నవారికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం రబీ పంటల కోతలు, నూర్పిళ్లు, పొగాకు సాగు పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. మరో నెల రోజుల పాటు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతుల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 31 తేదీ వరకు మాత్రమే గడువు ఇస్తూ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాకుండా సొంత భూములు కలిగి ఉన్న రైతులు సైతం జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉన్నారు. వారికి సమాచారం తెలియని పరిస్థితి. కొన్ని గ్రామాల్లోని రైతులకు సైతం రిజిస్ట్రేషన్ విషయం తెలియదంటే అతిశయోక్తి కాదు. అంతేగాకుండా రైతుల సంఖ్యకు తగినట్లుగా వ్యవసాయ సిబ్బంది లేకపోవడం కూడా నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అసాధ్యంగా మారింది.

ఇంటర్నెట్, సర్వర్ సమస్యలతో జాప్యం

రైతులకు తొలివిడతగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. అయితే ఇప్పటివరకు 8,142 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దాదాపు 8,916 మంది రైతులు యూనిక్‌ఐడీ కార్డులకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఉన్నారు.

ఆందోళనలో రైతులు

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై స్పష్టత లేక కొంత మంది అసైన్డ్, డీకేటీ పట్టా భూములు కలిగిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆప్షన్ ఇవ్వలేదని అధికారులు చెబుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కౌలు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతుండడంతో వీరంతా తమకు పథకాలు అందుతాయో? లేదోనని మీమాంసలో పడ్డారు. అలాగే దేవదాయ, అటవీ భూములను సాగు చేసుకునే రైతులు యూనిక్ కార్డుల ప్రక్రయను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అన్ని రకాల రైతులకు యూనిక్ ఐడీ కార్డులను అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ములు లేదా ఇతర పేర్లు ఉంటే ఒకరి పేరే నమోదవుతోంది. కొంతమంది రైతుల ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానం గాక నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నప్పటికీ మూడుసార్లు ఓటీపీ వచ్చేందుకు సమయం తీసుకుంటుండటంతో రైతులు పనులు మానేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు మండలంలో మొత్తం పట్టాదారుల సంఖ్య 17,058, ఇందులో ప్రభుత్వ భూమి 19,698 ఎకరాలు, పట్టా భూమి 56,689 ఎకరాలు ఉంది. ఇనాం భూములు 3055 ఎకరాలు కాగా, మిగతా భూమి 2410 ఎకరాలుగా రెవెన్యూ రికార్డులు పేర్కొంటున్నాయి.

ప్రతి రైతు నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు తమ వివరాలు నమోదు చేయించుకొని విశిష్ట సంఖ్యను పొందాలి. కర్నూలు మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో నమోదు పక్రియ శరవేగంగా జరుగుతోంది.
– రూఫస్ రొనాల్డ్, కర్నూలు మండల ఏఓ

కౌలు రైతులకు అన్యాయం



కౌలు రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేయకపోవడం అన్యాయం. గత ప్రభుత్వంలో సొంత భూమి ఉన్న వారితోపాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందేది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్యను మెలిక పెట్టి ఇనాం భూములు, డీ పట్టా కలిగిన వారికి పథకాలు దూరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. కూటమి సర్కార్ వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయి.
– తేనె సురేష్, గార్గేయపురం



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ, అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రానికి సమీపాన వెంకాయపల్లె వద్ద వెలసిన ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం విఫలం



అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): రాష్ట్రంలో డ్రగ్స్‌ను నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రఘువేంద్ర ఆరోపించారు. ఈ.తాండ్రపాడు గ్రామంలో మంగళవారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, నాయకులు గ్రామ సర్పంచ్ బాలపీర ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లడుతూ.. ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసి, ప్రతి స్కూలులో అన్ని సబ్జెక్టులకు టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ బాలపీర మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం



రైతులతో సమావేశమైన ఆర్డీఓ, అధికారులు

కర్నూలు(రూరల్): నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏపీఐఐసీ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ముచ్చుమర్రి పంపిగ్ స్టేషన్ నుంచి ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌కు ఏపీఐఐసీ వాటర్ పైప్‌లైన్ గార్గేయపురం, పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో పొలాల్లో వెళ్తున్నందున భూములు కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లడుతూ.. రైతుల అభిప్రాయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు చేసుకోండి



ఒండుట్లలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గడివేముల: సొంత పొలం కలిగిన రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఒండుట్ల, పైబోగుల గ్రామాల్లో పొగాకులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్‌కు అర్హులైన 6,265 మంది ఉండగా ఇప్పటి వరకు 1,365 మంది విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోలేదన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. దీంతో అన్నదాత సుఖీభవ, పంటల బీమా, మద్దతు ధర, యాంత్రీకరణ, ఎరువుల సబ్సిడీ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. యాంత్రీకరణ కింద మండలానికి రూ.9.2 లక్షల సబ్సిడీ మంజూరైందన్నారు. సబ్సిడీపై పనిముట్లు కావాల్సిన వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అకాల వర్షం.. తీరని నష్టం



గడివేములలో తడిసిన మిరపను చూపిస్తున్న రైతు చిన్నన్న



మొక్కజొన్న దిగుబడులపై నిల్వ ఉన్న వర్షపు నీరు

గడివేముల: అకాల వర్షానికి గడివేముల మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, గాలులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో కల్లాలలో ఆరబోసిన మిరప, మొక్కజొన్న పంట దిగుబడులు తడిసిపోయాయి. దిగుబడులపై పట్టాలు కప్పుకునేందుకు ప్రయత్నించగా వర్షం రావడంతో కప్పుకోలేక పోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

బహిరంగ వేలంలో 'పచ్చ' పాతం!

- చోద్యం చూసిన అధికారులు.. చక్రం తిప్పిన 'కూటమి' నాయకులు
- చర్చనీయాంశంగా మారిన పంచాయతీ ఆస్తుల వేలం



ఓర్వకల్లులో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: ఇప్పటి వరకు పాఠశాలల్లో వంట ఏజెన్సీలు, పంచాయతీలలో పారిశుద్ధ్య కార్మికులు, పౌర సరఫరా శాఖలో చౌక దుకాణాల రేషన్ డీలర్లు, జాతీయ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సహాయకుల విషయంలో చక్రం తిప్పిన కూటమి నాయకులు..చివరకు బహిరంగ వేలాల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామ పంచాయతీ ఆస్తులకు స్థానిక రచ్చకట్ట వద్ద బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడుతో పాటు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మీకాంతారెడ్డి హాజరయ్యారు. ఈ అధికార పార్టీ నాయకులు తమ సానుభూతి పరులే వేలం పాట దక్కించుకునేలా వ్యూహం పన్నారు. పారదర్శకంగా పనిచేయాల్సిన పంచాయతీ అధికారులు నిమిత్త మాత్రులుగా మారిపోయారు. వేలాల్లో ప్రధానంగా ఏడాది కాలం పాటు వాహనదారుల నుంచి గేటు సుంకం వసూలు చేసేందుకు (బండ్ల మెట్ట)పాట నిర్వహించగా అధికారపార్టీ సానుభూతి పరుడైన మహమ్మద్ హనీఫ్ పోటీపడి రూ.3.05 లక్షలకు దక్కించుకున్నాడు. ఇకపోతే 4 గ్రామ పంచాయతీ దుకాణాల్లో ఒకటోది రూ.15,600లకు (ఎస్ఎండీ యూసఫ్), రెండు, మూడు దుకాణాలను రూ.14,400 లకు వెంకటేశ్వర్లు, చాకలి రంగడు దక్కించుకోగా, 4 వ దుకాణం గతంలో రూ.14,400 లకు (ఉల్చాల మాసూంబాషా) పోగా ఈసారి స్థానిక ఓ బడా వ్యాపార వేత్త బైసాని వీరయ్యశెట్టి (టీడీపీ మద్దతుదారుడు) రూ.48 వేలకు వేలం దక్కించుకున్నాడు. మొత్తానికి బండ్ల మెట్ట, 4 దుకాణాలకు కలిపి రూ.3,92,900 పంచాయతీకి ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. పంచాయతీ దుకాణాలకు హెచ్చు పాటదారులు వేలం సొమ్మును వెంటనే చెల్లించారు. అయితే బండ్ల మెట్టను దక్కించుకున్న మహమ్మద్ హనీఫ్ సొమ్మును చెల్లించేందుకు నాలుగు రోజులు గడువుకోరగా.. పాత పాటదారుడైన మద్దిలేటి ససేమిరా? అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారు వేలం నిర్వహించిన రోజు సాయంత్రం 4 గంటల్లోగా చెల్లించకపోతే, సదరు బండ్ల మెట్టకు తిరిగి వేలం నిర్వహిస్తామని తేల్చిచెప్పారు. ఏది ఏమైనప్పటికీ అధికారులు నిర్వహించిన పంచాయతీ వేలం పాటల్లో చివరి వరకు టీడీపీ మద్దతుదారులదే హవా కొనసాగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అమ్మవారికి బంగారు ముక్కెర



బంగారు ముక్కెరను సమర్పిస్తున్న పల్లెదొడ్డివాసులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవికి దేవనకొండ మండలంలోని పల్లెదొడ్డి గ్రామానికి చెందిన పాలూరు నారాయణ, వరలక్ష్మి దంపతులు మంగళవారం 5 గ్రాముల బంగారు ముక్కెర సమర్పించారు. వారు మాట్లాడుతూ.. తమ ఇలవేల్పు అమ్మవారికి బంగారు ముక్కెరను సమర్పించినట్లు తెలిపారు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హాస్టల్‌లో రాత్రి బస

కర్నూలు (రూరల్): కర్నూలు మండల పరిధి గార్గేయపురం గ్రామంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మంగళవారం రాత్రి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మద్దిలేటి రాత్రి బస చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడు తూ చదువులు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. శ్రద్ధగా చదువుపై దృష్టి పెట్టి త్వరలో జరగబోయే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అదే విధంగా హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా, హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ డి.మదారి పాల్గొన్నారు.

నివాళి

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని రేమట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తిరుమల్ రెడ్డి మాతృమూర్తి, ఇదే గ్రామానికి చెందిన శాలుబాషా మరణించారు. ఈ విషయాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. అలాగే అంతిమ యాత్రలో ఆయన పాల్గొన్నారు. జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, సంపత్‌కుమార్, మౌలాలి, కర్నూలు మండల ఉపాధ్యక్షుడు నెహేమ్యా, డి.వాసు, మోహన్‌బాబు, విద్యాసాగర్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యార్థిని పరామర్శించిన కోడుమూరు ఎమ్మెల్యే

కల్లూరు: కోడుమూరు బాలుర వసతి గృహంలో జరిగిన దాడిలో గాయపడిన విద్యార్థి ఇసాక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పరామర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లారు.

వీహెచ్‌పీ నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన సభ్యులతో విశ్వహిందూ పరిషత్ సభ్యులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ఆంజినేయ స్వామి ఆలయంలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కౌలురు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా కిషోర్‌కుమార్, బనగానపల్లె కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళేశ్వరెడ్డి తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ కమిటీలను నియమించినట్లు తెలిపారు. అనంతరం సంఘం లక్ష్యాలు, సనాతన ధర్మం, ఆల యాల నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమరత సేవా ప్రముఖ్ ఓబులరెడ్డి , విశ్వహిందూ పరిషత్ సభ్యులు శంకరయ్య, భద్ర, జితేంద్ర, బాలక్రిష్ణ , వేణు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న పోక్సో స్పెషల్ జిల్లా జడ్జి రాజేంద్రబాబు

కర్నూలు(రూరల్): పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినట్లు పోక్సో కోర్టు స్పెషల్ జిల్లా జడ్జి రాజేంద్రబాబు తెలిపారు. మంగళవారం కర్నూలు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, అంగన్‌వాడీ టీచర్లకు పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి రాజేంద్రబాబు మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం–2012 ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. పిల్లలకు ఏదైనా సమస్య ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. సదస్సులో తాలుకా అర్బన్ ఏఎస్ఐ గోపాల్, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరముడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎస్సీ హాస్టల్ వార్డెన్ మాదురి పాల్గొన్నారు.

భక్తజన సందడి

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు అమ్మవారిని వేకువ జామున దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలువురు మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఈఓ రామలింగారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సందీప్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ద్వితీయ సంవత్సరం చదువుతున్న సందీప్‌కుమార్ షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21,23 వ తేది జేఎన్‌టీయూ కలికిరిలో జరిగిన 12వ అంతర క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో పీడీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



గోరంట్ల మాధవస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 10 రోజుల్లో భక్తులు హుండీల్లో ద్వారా సమర్పించిన కానుకలతో పాటు ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.16,29,899 వచ్చినట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలోని తాత్కాలిక, పర్మినెంట్ హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,46,100, అన్నదానం చందాలు రూ.74,710, తాత్కాలిక అంగళ్ల ద్వారా రూ.37,230, పర్మినెంటు హుండీ ద్వారా రూ.5,54,446, అన్నదానం హుండీ ద్వారా రూ.2,78,436, తాత్కాలిక హుండీ ద్వారా రూ.5,38,977 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. గతేడాది రూ.10,38,825 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.16,29,899 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలియజేశారు.